www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 8 మే 2025
5
వైఎస్‌ఆర్



జడ్‌పిలో కారుణ్య నియామకాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు 9 మందికి కారుణ్య నియామక కింద జడ్‌పి చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి నియామక పత్రాలు అందజేశారు. బుధవారం జడ్‌పి సిఇఒ ఓబులమ్మతో కలిసి చైర్మన్ నియామక పత్రాలు పంపిణీ చేశారు. త్వరితగతిన నియామక పత్రాలు అందజేసినందుకు చైర్మన్, సిఇఒకు ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎంఈ శ్రీనివాసుల రెడ్డి, శ్రీనివాసుల రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి భాస్కర్ రెడ్డి, వైస్ చైర్మన్ బాలయ్య, జడ్‌పిటిసి జయపు రెడ్డి పాల్గొన్నారు. అనంతరం కారుణ్య నియామక పత్రాలు పొందిన అభ్యర్థులు చైర్మన్‌ను సన్మానించారు.

ఖరీఫ్ సాగుకు కసరత్తు

- 3.16 లక్షల ఎకరాలతో ప్రణాళిక
- 11,462 క్వింటాళ్ల విత్తనం
- 92 వేల టన్నుల ఎరువులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా ఖరీఫ్-2025-26 యాక్షన్‌ప్లాన్ సిద్ధమైంది. జిల్లా వ్యవసాయశాఖ 3,16,367 లక్షల ఎకరాల్లో పంటల సాగుకు కసరత్తు చేస్తోంది. గతేడాది 4,58,718 లక్షల ఎకరాల్లో పంటల సాగు ప్రణాళిక రూపకల్పన చేసిన సంగతి తెలిసిందే. ఈలెక్కన 2025-26 ఖరీఫ్ సాగు లక్ష్యాన్ని 1.42 లక్షల ఎకరాల మేరకు కుదించడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా వ్యవసాయశాఖ ఎరువులు, విత్తన, పురుగు మందుల ప్రతిపాదనల్ని అందజేసింది. పచ్చిరొట్ట ఎరువులు, వేరు శనగ, ఇతర పంటల సబ్సిడీ విత్తన పంపిణీకి శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 210 ఆర్‌బికెల ద్వారా విత్తనం, ఎరువుల పంపిణీ ఏర్పాట్లపై దృష్టి సారించింది. 11,462 క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులో ఉంచడానికి అవసరమైన కసరత్తు చేస్తోంది. 5,144 క్వింటాళ్ల పిల్లిపెసర, జనుము, జీలగ వంటి పచ్చిరొట్ట ఎరువులను, 6,318 క్వింటాళ్ల కె6, నారాయణి, కె1812, విశిష్ట రకాల వేరుశనగ విత్తనాల్ని అందుబాటులో ఉంచనుంది. 76,085 ఎకరాల్లో వరి, 1,252 ఎకరాల్లో జొన్న, 2,689 ఎకరాల్లో సజ్జలు, 2,302 ఎకరాల్లో మొక్కజొన్న, 2,778 ఎకరాల్లో మిల్లెట్స్, ఆయిల్‌సీడ్స్ 14,229 ఎకరాలు, 9,400 ఎకరాల్లో మినుములు, పప్పు ధాన్యాలు 24,433 ఎకరాలు, పత్తి 59,368 ఎకరాలు, 175 ఎకరాల్లో సుగర్‌కేన్ సాగు చేయనుంది. వీటితోపాటు 92 వేల మెట్రిక్ టన్నుల ఎరువుల ప్రతిపాదనలు అందజేసింది. ఇందులో 32,000 టన్నుల యూరియా, 10,000 టన్నుల డిఎపి, 5,0 00 టన్నుల ఎంఒపి, 5,000 టన్నుల ఎస్‌ఎస్‌పి, 40,000 టన్నుల కాం ప్లెక్స్ ఎరువులను అందుబాటులో ఉంచడానికి అవసరమైన చర్యలు తీసు కుంది. ప్రతినెలా 4,725 టన్నుల మేర నిల్వ ఉంచడానికి అనువైన జాగ్రత్తలు తీసుకుంది. ఈనేపథ్యంలో జిల్లాలో పంటల సాగు అవసరాలను బట్టి అదనపు ఎరువుల కోసం ఇండెంట్ ద్వారా సేకరించి అందజేయడంపై దృష్టి సారించింది.

20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న ఎఐటియుసి, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్లు రద్దు చేయాలని కోరుతూ ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని ఎఐటియుసి, సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జిల్లాలో జయప్రదం చేయాలని కోరుతూ ఎఐటియుసి కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కరోనా సమయంలో చర్చలేకుండా తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ల అమలుకై చేస్తున్న తీవ్ర ప్రయత్నాలను అడ్డుకునేందుకు సమ్మె చేస్తున్నట్లు పేర్కొన్నారు. 13 కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తారని చెప్పారు. కార్మికులకు కనీస వేతనం ధరలకు అనుగుణంగా రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలు బలంగా ఉన్నప్పుడు కూడా కార్మికులకు అరకొరగా మాత్రమే న్యాయం జరిగేదని, ఇప్పుడు 44 కార్మిక చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడ్స్ తీసుకురావడంతో కార్మికులు బానిసల కంటే దారుణమైన పరిస్థితుల్లోకి నెట్టబడతారని హెచ్చరించారు. చట్టాలన్నీ ఉల్లంఘించే యాజమాన్యాలపై విధించే శిక్షలను తొలగించి, రాజ్యాంగబద్ధంగా పోరాడే కార్మికులపై క్రిమినల్ చర్యలు తీసుకునేలా చట్టాలను మార్పులు చేయడాన్ని కార్పొరేట్ పెట్టుబడిదారుల లాభాలకోసమేనని విమర్శించారు. పెట్టుబడిదారి ఆర్థిక సంక్షోభాన్ని సామాన్య ప్రజలపై బలవంతంగా రుద్దేందుకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను సమ్మె ద్వారా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈనెల 10లోపు యాజమాన్యాలకు, అధికారులకు సమ్మె నోటీసులు అందించాలని, 11న జిల్లా విస్తృత సమ్మె సదస్సును, 15న రౌండ్ టేబుల్ సమావేశం, 17,18 స్కూటర్ ర్యాలీలు నిర్వహించాలని పేర్కొన్నారు. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో, మండలాల్లో సదస్సులను పూర్తిచేయాలని, కరపత్రాల ద్వారా కార్మికుల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని కార్యాచరణ ప్రకటించారు. సమావేశంలో ఎఐటియుసి, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. వేణుగోపాల్, కె.శ్రీనివాసులురెడ్డి, ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.మల్లికార్జునరెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కె.సి. బాదుల్లా, సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, ఎఐటియుసి నగర అధ్యక్షులు యు.మద్దిలేటి, ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి తారక రామారావు, ఉపాధ్యక్షుడు రాజశేఖర్ పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజుకు నివాళి

ప్రజాశక్తి - కడప అర్బన్

స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి సీతారామరాజు పాత్ర కీలకమైందని, పరిమిత వనరులతో బ్రిటిష్ వారిని గడగడలాడించిన పోరాటయోధుడని కొనియాడారు. మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడి 27 ఏళ్ళ చిన్న వయసులోనే ప్రాణత్యాగం చేశారన్నారు. మన్యం ప్రజల దీన స్థితిగతులను పరిశీలించి, బ్రిటిష్ అధికారుల నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా ప్రజలతో కలిసి పోరాడారన్నారు. గెరిల్లా యుద్ధ తంత్రకళను ఉపయోగించి బ్రిటీష్ సైన్యానికి ముచ్చెమటలు పట్టించారని తెలిపారు. స్థానికులు ఆయనను 'మన్యం వీరుడు' అని పిలుచుకునే వారున్నారు. ఈ విప్లవాన్ని ఎలాగైనా అణచివేయాలని నిర్ణయించుకున్న బ్రిటీష్ ప్రభుత్వం మన్యంలో ముమ్మర చర్యలు చేపట్టి చాలా మంది రాజు అనుచరులను చంపేసిందని చెప్పారు. స్వాతంత్ర్య ఉద్యమంలో అల్లూరి సీతారామరాజు ది ప్రత్యేక అధ్యాయమని, నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన మహనీయుడని చెప్పారు.

భారత సైన్యానికి ధన్యవాదాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎల్లప్పుడు శాంతిని కోరుకునే మన దేశంలోని అమాయకపు ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదులపై ధీటుగా సమాధానం చెప్పిన భారత సైన్యానికి ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్, జిల్లా మేధావి సమాఖ్య అధ్యక్షులు వివేకానంద రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. బుధవారం స్కూల్ ప్రాంగణంలో జాతీయ జెండాను చేత బూని దేశభక్తిని చాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక ప్రదేశం పహల్గంలో ఉగ్రదాడి తర్వాత భారత సైన్యం చాకచక్యంగా వ్యవహరించి ఉగ్రస్థావరాలపై దాడులు చేసి ఉగ్రవాదులను హతమార్చడం హర్షణీయమన్నారు. ఇప్పటికైనా గుణపాఠం నేర్చుకోకుండా పాకిస్తాన్ కవ్వింపు చర్యలకు పాల్పడితే భారతదేశంలో ఉన్న ప్రతి పౌరుడు కూడా వారికి తగిన గుణపాఠం నేర్పించడానికి సంసిద్ధతతో ఉన్నారన్నారు.

ఉగ్రవాద స్థావరాలపై దాడి అభినందనీయం

పాకిస్తాన్ పిఒకె ఉగ్రవాద శిక్షణ స్థావరాలపై భారత్ వైమానిక దళాలు చేసిన దాడి అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పీర్ అన్నారు. బుధవారం కాగితాల పెంటలోనే కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని తుద ముట్టించేంత వరకు భారత్ వెనుకడుగు వేయరాదని కోరారు. పహల్గాంలో అమాయకుల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదులకు తగిన సమాధానం చెప్పిన భారత్ ఆర్మీ కి ధన్యవాదాలు తెలిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప : అసంఘటిత కార్మికులు ఇ-శ్రమ్ కార్డుల పట్ల అవగాహన పెంచుకుని ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారి శ్రీనివాసులు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది రవితేజ, ప్రవీణ్ కుమార్, పారా లీగల్ వాలంటీర్ ఈశ్వరయ్య అన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కడప నగరం రైల్వే స్టేషన్ ఆటో స్టాండ్, రవీంద్ర నగర్ మెయిన్ రోడ్డు, పాత బస్టాండ్ ఫ్రూట్ బజార్‌లలో అసంఘటిత కార్మికులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్టపరమైన సహాయం, ఆస్తి వివాదాలు, బాల కార్మికులు, ఉద్యోగి-యజమాని సమస్యలు, ఇ-శ్రమ్ కార్డుల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. అసంఘటిత కార్మికుల, వ్యవసాయ కార్మికుల సమస్యలను గుర్తించడం వారికి తగు న్యాయ సహాయం అందించడం, ఉచిత న్యాయ సహాయము, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 మొదలగు అంశాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో అసంఘటిత కార్మికులకు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల వినూత్న నిరసన

ప్రజాశక్తి - బద్వేలు

మోకాలిపై నిల్చుని నిరసన తెలియజేస్తున్న కార్మికులు

మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ బద్వేల్ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్‌టిసి బస్టాండ్ వద్దనున్న పొట్టి శ్రీరాములు సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి మోకాళ్లపై నిలబడి వినూత్నంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్త ఆందోళనలు నిర్వహిస్తున్న సమయంలో టిడిపి నాయకులు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యలన్నింటిని పరిష్కారం చేస్తామని చెప్పి హామీలు ఇచ్చిందని, ఇప్పుడు అధికారంలోకి వచ్చి పదినెలలు గడుస్తున్నా సమస్యలు పరిష్కరించకపోవడం దారుణమని, అలాగే స్థానిక మున్సిపాలిటీలో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగ -ఉపాధి అవకాశాలు, ఎక్స్‌గ్రేషియాలు, మట్టి ఖర్చులు కూడా చెల్లించకపోవడం దారుణమని పేర్కొన్నారు. గత సమ్మె కాలపు వేతనం మంజూరు చేయలేదని, పారిశుధ్య కార్మికులకు ఇవ్వవలసిన రక్షణ పరికరాలను సైతం ఇచ్చేందుకు అనుమతులు లేవని చెప్పడం హాస్యాస్పదమని వాపోయారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులు కృషి చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ కె.నాగేంద్రబాబు, పట్టణ నాయకులు ఎస్. రాయప్ప, యూనియన్ పట్టణ అధ్యక్షులు పులి శ్యామ్ ప్రవీణ్, కార్యనిర్వాహక అధ్యక్షులు దియ్యాలహరి, ఉపాధ్యక్షులు గంటా శ్రీనివాసులు, దియ్యాల దేవమ్మ, ప్రధాన కార్యదర్శి దియ్యాల నాగేంద్రబాబు, సహాయ కార్యదర్శి బద్వేల్ ప్రవీణ్ కుమార్, కోశాధికారి కాలువ శివకుమార్, పట్టణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డిఎస్‌సి అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలి : డివైఎఫ్‌ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్ : డిఎస్‌సి అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలని డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి విరునాల శివకుమార్ కోరారు. బుధవారం డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి డిఆర్‌ఒకు వినతి పత్రం అందజేశారు. . ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ఏడేళ్ల తర్వాత వెలువడిన నోటిఫికేషన్‌లో నిరుద్యోగులు సన్నద్ధం అవ్వడానికి పరీక్షకు కనీసం 90 రోజులను సమయం లేకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. వయోపరిమితి 44 సంవత్సరాలు చేశారని తెలిపారు. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం 47 సంవత్సరాలకు ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమవడానికి వయోపరిమితి పెంచిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం 49 సంవత్సరాలకు వరకు అవకాశం కల్పించాలని కోరుతున్నామన్నారు. నార్మలైజేషన్ రద్దుచేసి జిల్లాకు ఒకే పేపర్ నిర్వహించాలని అన్నారు. ఓపెన్ డిగ్రీలో పాస్ అయిన వారి కూడా అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీపరీక్షల్లో 40శాతం తప్పనిసరి ఉండాలని నిబంధన తొలగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం టెక్నికల్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమం జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహులు, నగర నాయకులు ఉదయ పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయాన్ని సందర్శించిన రిటైర్డ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ

ప్రజాశక్తి - కడప అర్బన్ : రిటైర్డ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ ఎస్.చెల్లప్ప బుధవారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. పరిశోధన కేంద్రంలోని తాళపత్ర గ్రంథాలను, తామ్రపత్రాన్ని, చేతితో తయారు చేసిన కాగితాలను, బ్రౌన్ రచనలను, మెకంజీ కైఫియత్తులను చూసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను గతంలో సి.పి.బ్రౌన్ గ్రంథాలయాన్ని సందర్శించానన్నారు. అప్పటి కన్నా ఇప్పుడు చాలా అభివృద్ధి చెందిందన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి పాటుపడుతున్న విశ్వవిద్యాలయ అధికారులను, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయ భాస్కర్, సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్ ఆర్. వెంకటరమణ, విశ్రాంత తహశీల్దార్లు పాల్గొన్నారు.

జిల్లాలో నీటి ఎద్దడి తలెత్తకూడదు : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

వేసవిలో జిల్లాలో ఎక్కడా నీటి ఎద్దడి పరిస్థితులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి డ్వామా, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ రాజ్ అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్‌ఎస్ హాలులో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఎంజిఎన్‌ఆర్‌జిఎస్ ద్వారా జిల్లాలో చేపడుతున్న వివిధ కాల పనుల పురోగతిపై జెసి అదితిసింగ్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి సీజన్‌లో గ్రామీణ ప్రాంతాల్లో పెంపుడు జీవాలకు ఎలాంటి తాగునీటికొరత లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఫారం పాండ్స్, ఇంకుడు గుంతలు, స్పార్స్ రైన్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాల ద్వారా సమీప నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ వ్యవసాయ, ఉద్యాన పంటల సాగుతో మెట్ట భూములను సాగులోకి తీసుకురావాలన్నారు. వ్యవసాయంలో అంతర్భాగమైన ఉద్యాన, ప్రకృతి సాగు, పాడి, మత్స్య సంపదను గ్రామాల్లో అభివృద్ధి చేసే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఎంపిడిఒలు, ఎపిఒలు వారు పనిచేసే మండలాల్లోనే నివాసం ఉంటూ ఉద్యోగ విధులను పూర్తిస్థాయిలో నిర్వర్తించాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను ప్రణాళిక మేరకు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో లేబర్ కంపోనెంట్‌ను పెంపొందించాలన్నారు. అవసరం ఉన్న ప్రాధాన్య పనులకు ఉపాధి కూలీలను సద్వినియోగం చేయాలన్నారు. రానున్న మూడు నెలల్లో ఎంపిక చేసిన 100 గ్రామాల్లో మొత్తం పచ్చదనంతో నింపాలని చెప్పారు. వ్యవసాయం సాగుతో పాటు 60 శాతం పైగా ఉద్యానసాగును, మిగిలిన సూక్ష్మ శాతాన్ని పశు సంపదతో పునరుజ్జీవ కల్పన సాధించాలన్నారు. స్వయం సహాయక సంఘాలు, రైతులను భాగస్వామ్యం చేసుకుంటూ గ్రామసభలు నిర్వహించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో వనరుల ఆధారంగా ప్రకృతి వ్యవసాయం, అనుబంధ పంటల సాగుకు మొగ్గు చూపేలా వారిలో అవగాహన పెంపొందించాలన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో సుస్థిర అభివృద్ధి సాధనకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో డ్వామా పీడీ ఆదినారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ ఏడుకొండలు, పిఆర్ ఎస్‌ఇ శ్రీనివాసులురెడ్డి, ఉద్యాన శాఖ డిడి సుభాషిణి, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, పశుసంవర్ధక శాఖ జెడి డాక్టర్ శారదమ్మ, డ్వామా ఎపిడిలు, ఎపిఒలు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజలకు ముందస్తు అవగాహన కల్పించాలి

దేశంలో పౌర రక్షణ చర్యలను బలోపేతం చేసే దిశగా జిల్లాలో ముందస్తుగా భద్రతపై మరింత అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పోలీసు, రెవెన్యూ, భద్రతా, అత్యవసర సేవా, అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం సివిల్ మాక్ డ్రిల్ అంశంపై జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు జారీ చేశారు. కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్దేశించిన సివిల్ డిఫెన్స్ రూల్స్ ప్రకారం జిల్లాలో పౌర రక్షణకై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మాక్ డ్రిల్ నిర్వహించాలని ఆదేశించారు. ఆ మేరకు జిల్లాలోని రెవెన్యూ, పోలీసు, ఫైర్, మెడికల్, మొదలైన ఎమర్జెన్సీ సర్వీసులు, ఇతర అధికారులు భాగస్వామ్యం కావాలన్నారు. ప్రత్యేకించి జిల్లాలోని జిజిహెచ్, ఏరియా, జిల్లా ఆసుపత్రుల సూపరింటెండెంట్‌లతో సమన్వయం చేసుకుని అత్యవసర చికిత్సలు, మందులను, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచుకోవాలని డిఎంహెచ్ఒను ఆదేశించారు. జిల్లాలో ఉన్న విద్యుత్, ఇంధన, అణు ఉత్పాదక సంస్థలు, కర్మాగారాలైన ఆర్‌టిపిపి, పవర్ గ్రిడ్, ఐఒసిఎల్, హెచ్‌పిసిఎల్, యుసిఐఎల్ తదితర సంస్థల్లో కచ్చితంగా పౌర భద్రతా ముందస్తు చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించాలని చెప్పారు. అన్ని రెవెన్యూ డివిజన్ల ఆర్‌డిఒలు తమ పరిధిలోని మండలాల్లోని సంబంధిత అధికారులతో కలసి పౌర రక్షణ ముందస్తు చర్యలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌పి అశోక్ కుమార్, జెసి అదితిసింగ్, జిల్లా ఫైర్ అధికారి ధర్మారావు, పరిశ్రమల శాఖ జిఎం చాంద్‌బాషా, ఇతర జిల్లా అధికారులు హాజరయ్యారు.

దీక్ష చేపడుతున్న కార్మికులు

కార్మికుల తొలగింపు దారుణం

-సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి

- కార్మికుల 24 గంటల దీక్ష ప్రారంభం

ప్రజాశక్తి- కడప అర్బన్

నగరంలో 40 మంది కార్మికులను 60 సంవత్సరాలు నిండాయని తొలగించడం దారుణమని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి అన్నారు. బుధవారం ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర కమిటీ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కార్మికులు 24 గంటల దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు కడప నగరం ఏర్పాటు కాకముందు నుంచి పనిచేస్తూ ఉన్నారని పేర్కొన్నారు. వారికి ఏం మాత్రం రిటైర్మెంట్ బెనిఫిట్ లేకుండా ఇంటికి పంపించడం సరైన పద్ధతి కాదని తెలిపారు. వారేమీ పెన్షన్ రూ. లక్ష అడగలదని, కేవలం రూ.10 వేలు మాత్రమే అడుగుతున్నారనే తప్ప ఇతర గొంతెమ్మ కోరికలు కోరలేదని పేర్కొన్నారు. పెన్షన్ రూ.15వేలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షలు ఇవ్వకపోతే ఈనెల 8న ఉదయం 5 గంటల నుంచి కడప కార్పొరేషన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్న కడప కార్పొరేషన్ బాధ్యత వహించాలని చెప్పారు. మున్సిపల్ కార్మికులు చేస్తున్న పోరాటానికి సిఐటియు అండగా ఉంటుందని తెలిపారు. 24 గంటలు దీక్షలో కార్మికులు కూర్చున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ కమిటీ సభ్యులు, డ్రైవర్ల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సుంకరి కిరణ్, వడ్లపల్లి శ్రీధర్ బాబు, మహిళా కమిటీ సభ్యులు మున్నంగి.పెంచలమ్మ, ధరణి, ఉష, నాగరాజ్,బి, నాగరాజు, మున్నంగి. ఆసి బాబు, హరి, రాజు, పెంచలయ్య, కార్మికులు పాల్గొన్నారు.

విశ్వకవికి జెవివి ఘన నివాళి

ప్రజాశక్తి - కడప అర్బన్ : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నగరంలో ఉన్న జిల్లా గ్రంథాలయంలో బుధవారం జాతీయ గీత రచయిత రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా అధ్యక్షులు సమీర్ బాష మాట్లాడుతూ ఠాగూర్ రచనలు మనకు మానవత్వాన్ని, ప్రేమను విశ్వశాంతిని బోధిస్తాయని తెలిపారు. ఆయన జీవిత చరిత్ర ప్రతి ఒక్కరికి ప్రేరణగా నిలుస్తుందని చెప్పారు. ఆయన రాసిన జాతీయ గీతం 'జనగణమన' దేశ సమైక్యతను చాటి చెప్పే గీతం అని, 1913లో ఆయనకు' గీతాంజలి' అనే ఆంగ్లానువాద కవితా సంపుటికి గాను నోబెల్ బహుమతి కూడా లభించిందని పేర్కొన్నారు. బ్రిటిష్ వారు ఇచ్చిన 'నైట్' అనే బిరుదును జలియన్ వాలాబాగ్ హత్యాకాండ తరువాత తన నిరసనను తెలుపుతూ దాన్ని తిరస్కరించడం ఠాగూర్ విలువలకు అద్దం పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో లైబ్రరీ సిబ్బంది పవన్, బాబ్జి, సుబ్రహ్మణ్యం, సుబ్బమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

మహానాడు ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - కడప అర్బన్ : తెలుగుదేశం పార్టీ మహానాడు ఏర్పాట్లను ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి, పోలిట్ బ్యూరో సభ్యులు, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్త చైతన్యరెడ్డి పరిశీలించారు. బుధవారం జయరాజ్ గార్డెన్, పబ్బాపురం గ్రామం సమీపంలోని మహానాడు ప్రాంగణాన్ని సందర్శించారు. వేగంగా కొనసాగుతున్న మైదాన అభివృద్ధి పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అవసరమైన సూచనలు చేశారు. మహానాడు విజయవంతం కావడమే లక్ష్యంగా ప్రతి ఏర్పాటును సమగ్రంగా పర్యవేక్షించారు.

బుగ్గ వంక పరిసరాలను ఎమ్మెల్యే మాధవి, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు. అల్మస్ పేట, రామకృష్ణ బ్రిడ్జి, రవీంద్రనగర్ బ్రిడ్జి, లక్ష్మి రంగ బ్రిడ్జి, రైతు మార్కెట్ బ్రిడ్జి, ఎస్.వి ఇంజినీరింగ్ కళాశాల, బ్రిడ్జి ప్రాంతాల్లో బుగ్గవంకలో కొనసాగుతున్న క్లీనింగ్ కార్యకలాపాలను పరిశీలించారు. ప్రజలకు ఆరోగ్యకరమైన పర్యావరణం అందించడమే లక్ష్యంగా, నీటి ప్రవాహం, చెత్త నిర్మూలన, పారిశుధ్య నిర్వహణపై వర్కర్లకు సూచనలు అందించి, మెరుగైన పనితీరు కోసం మార్గనిర్దేశం చేశారు.

మోసాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి -కడప : ఆన్‌లైన్ ద్వారా డబ్బు మోసాలు, షాపింగ్ మోసాలు, పెట్టుబడి మోసాలు, డిజిటల్ అరెస్టులు వంటి మోసాలపై అవగాహన కలిగి ఉండాలని 30వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ సూర్య నారాయణ మూర్తి, కడప నగర సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ నాగరాజు అన్నారు. తెలుగు గంగ కాలనీలో నిర్వహిస్తున్న ఎన్‌సిసి కంబైన్డ్ వార్షిక శిక్షణ శిబిరంలో భాగంగా కడప నగర సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ నాగరాజు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా నాగరాజు మాట్లాడుతూ ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ మరియు టిక్‌టాక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా జరిగే మోసాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మహిళ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీదేవి మాట్లాడుతూ ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ పాల్పడిన విద్యార్థులకు కఠినమైన చట్టాలు వర్తిస్తాయని తద్వారా విలువైన జీవితం కోల్పోతారని తెలిపారు.

12న కార్పొరేషన్ ఎదుట ధర్నా : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

చెర్లోపల్లి లే అవుట్‌లో పర్యటిస్తున్న సిపిఎం నాయకులు

నగర పరిధిలోని చెర్లోపల్లి లే అవుట్ పరిధిలో నివాసముంటున్న పేద ప్రజల సమ స్యలు తక్షణమే పరిష్కారం చేయాలని, లే అవుట్‌లో రహదారిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న కార్పొరేషన్ ఎదుట ధర్నా నిర్వహించనున్నామని సిపిఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ పేర్కొ న్నారు. బుధవారం నగరంలోని చెర్లోపల్లి లేఔట్ లో ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సిపిఎం ప్రతినిధి బృందం ఆ ప్రాంతంలో పర్యటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేఅవుట్ పరిధిలో దాదాపు 500 మందికి ఉపయోగపడే ప్రధాన రహదారి లేకపోవడం కారణంగా అక్కడ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. 2008లో అప్పటి ప్రభుత్వం ఇల్లు లేని పేదలను గుర్తించి వారందరికీ స్థలాలు కేటాయించిందని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ ప్రాంతంలో ప్రధాన రహదారి లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని చెప్పారు. ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతోపాటు ఆ కాలనీలో మంచి నీటి సమస్య తీవ్రంగా ఉందని, తక్షణమే పరిష్కారానికి కృషి చేయాలని అధికార యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. శ్మశాన వాటిక ఏర్పాటు చేయక పోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు సంయుక్తంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కాలనీని సమగ్రంగా అభివృద్ధి చేసే వరకు సిపిఎం పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. 12న నిర్వహించే ఆందోళనలో చెర్లోపల్లి లేఔట్ లో ఇళ్ల స్థలాలు కేటాయించిన ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరి రెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, కుమారస్వామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, గోవిందు, నరసింహ, స్థానిక ప్రజలు వెంకటసుబ్బయ్య, వెంకటరెడ్డి, రామకృష్ణ, రెడ్డి బాష, రవిశంకర్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి గుబులు : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న మహ్మద్ అలీఖాన్

రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపిస్తూ వైఫల్యాన్ని నిలదీస్తున్న పిసిసి అధ్యక్షులు వై.ఎస్. షర్మిల నాయకత్వం, ఆమె పనితీరును చూసి కూటమి ప్రభుత్వంలో గుబులు పుట్టుకుందని ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ పేర్కొ న్నారు. ఇటీవల జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కాంగ్రెస్ పార్టీ, పిసిసి అధ్య క్షులు షర్మిలపై చేసిన ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ ఖండిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కుటుంబానికి రాజకీయ జీవితం ప్రసాదించిన పార్టీగా కాంగ్రెస్ పార్టీకి కడప జిల్లాలో పేరుందని స్పష్టం చేశారు. కీ.శే. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఎమ్మెల్యే కుటుంబానికి రాజకీయ జీవితం ప్రసాదించారని గుర్తు చేశారు. అలాంటి పార్టీ తుడిచి పెట్టుకుపోవాలని ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. షర్మిలను గాంధారి అని సంభోదించడం సరికాదని పేర్కొన్నారు. జమ్మలమడుగులో పరిశ్రమల ఏర్పాటుతో పాటు రాష్ట్రంలో తాగునీరు, సాగునీరు ఇతర ప్రాజెక్టుల రూపకల్పన, రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు చేశాయన్న వాస్తవం ఎమ్మెల్యే మరిచిపోయారా అని ప్రశ్నించారు. ప్రజల్లో వై.ఎస్. కుటుంబానికి ఉన్న ఆదరణ అభిమానం ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఒబిసిజిల్లా అధ్యక్షుడు చిన్న కులయప్ప, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు మయాన రహమతుల్లా ఖాన్, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. కమల్ బాషా, పార్టీ నేత లు హమీద్, గౌరీదేవి పాల్గొన్నారు.

ఉచితంగా మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వ పెన్షన్ కార్యాలయం వద్ద ఉచిత మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కడప ఇన్‌ఛార్జి తహసిల్దార్ శివారెడ్డి మజ్జిగ పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెన్షనర్లు ఇటువంటి మంచి కార్యక్రమానికి చేపట్టడం అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వ పెన్షనర్లుప్రజాసేవ చేయడం చాలా సంతోషదాయకమన్నారు. పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామమూర్తి నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పెన్షనర్లు వాలంటరీగా కార్యక్రమం నిర్వహించడానికి ఆర్థిక సహాయం చేసిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక కార్యక్రమంలో పాలు పంచుకొనుటలో ప్రభుత్వ పెన్షనర్ల దాతృత్వం మరువలేనిది చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగ మునిరెడ్డి, కోశాధికారి నూనె నగేష్, వైస్ ప్రెసిడెంట్ నారాయణ, సుభాన్, వెంకటసుబ్బయ్య, జె.వి. నారాయణ, టి.నారాయణ, ఎన్.రామ్మూర్తి నాయుడు, ఎ.గంగాధర్, నారాయణ, ఎఇ సత్యరాజు టి.సుబ్బరాయుడు, ఎ.వి.రమణ, రామ మోహన్ రెడ్డి, చిన్న రాయుడు, శ్రీనివాసులు, నగేష్, చలపతి గౌడ్, రాయుడు, జయ రాయుడు, లక్ష్మయ్య పాల్గొన్నారు

చాపాడులో దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు

రేషన్ కార్డులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - చాపాడు

ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న రేషన్ కార్డుదారులకు దరఖాస్తు చేసుకునే అవకాశం కలిగింది. బుధవారం నుంచి సచివాలయాల్లో రేషన్‌కార్డులకు సంబంధించి సిబ్బంది దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. రేషన్ కార్డులో నూతనంగా పేర్లు చేర్పులు, మార్పులకు అవకాశం ఉంది. చిన్న పిల్లలు, కొత్తగా వివాహమైన వారికి అవకాశం కల్పించారు. అనర్హుల పేర్లు తొలగింపునకు అవకాశం ఉంది. జనన ధృవీకరణ పత్రం, వివాహ రిజిస్ట్రేషన్ పత్రం, ఆధార్ కార్డులతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సచివాలయంలో రేషన్ కార్డు దరఖాస్తు చేసుకుంటే అనంతరం విఆర్ఒ, ఆర్ఐ లాగిన్‌కు బదిలీ అవుతాయి. అర్హులు సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటున్నారు.

ఎయిడెడ్ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - లింగాల

2025-26 విద్యా సంవత్సరంలో అయిదేళ్లు నిండిన పిల్లలను ఎయిడెడ్ పాఠశాలల్లో చేర్చేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఇఒ రామకృష్ణ పేర్కొన్నారు. సచివాలయం, మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం, మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనాథ పిల్లలు, విభిన్నప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బిసి, ఒసి, మైనార్టీలకు చెందిన వారు అర్హులన్నారు. గ్రామీణ ప్రాంతంలో సంవత్సరానికి కుటుంబ ఆదాయం రూ.లక్ష ఇరవై వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.లక్ష నలభై వేలు మించకుండా ఉండాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి ఆయన కోరారు.

ప్రయివేట్ పాఠశాలల్లో..

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని ప్రయివేట్ పాఠశాలల్లో ఒకటవ తరగతిలో ఉచిత ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఇఒ టివి రవికుమార్ తెలిపారు. విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి ప్రయివేట్ పాఠశాలల్లో 25 శాతం ఒకటవ తరగతిలో చేరేందుకు ఉచిత అడ్మిషన్స్ ఇస్తారన్నారు. పాఠశాలకు 3 కిలోమీటర్ల పరిధిలో నివాసం ఉన్న వారు అర్హులన్నారు. అర్హతగల పిల్లలు వైట్‌సైట్ ద్వారా ఈనెల 15లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

స్థానిక డిగ్రీ కళాశాల ఫీడర్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేయాల్సి ఉన్నందున గురువారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు గుంతబజార్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎఇఇ జగదీశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరా యధావిధిగా సరఫరా అవుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

విద్యుత్ ఒప్పందాలపై వాస్తవాలు మాట్లాడాలి

ప్రజాశక్తి - చాపాడు

విద్యుత్ ఒప్పందాలపై వైసిపి నాయకులు వాస్తవాలు మాట్లాడాలని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పి.మునిశేఖర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను యాక్సెస్ సంస్థతో యూనిట్‌కు రూ.5.12 చెల్లించేలా 2022లో సిఎం హోదాలో వైఎస్ జగన్ చేసుకోవడాన్ని గుర్తుచేశారు. 2024లో కూటమి ప్రభుత్వం వచ్చాక యూనిట్ రూ.4.60కి యాక్సెస్‌తో 0.52 పైసలు తగ్గించి ఒప్పందం చేసుకున్న విషయం వాస్తవం కాదా అన్నారు. ఈ ఒప్పందం వలన ప్రభుత్వానికి, అటు ప్రజలపైన రూ.2,719 కోట్లు భారం తగ్గుతుందన్నారు. ప్రజలు వాస్తవాలు గమనిస్తున్నారని, వైసిపి నాయకులు అనవసరపు రాద్ధాంతం చేయడం మానుకోవాలన్నారు.

జాబ్‌మేళాకు స్పందన కరువు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సింహాద్రిపురంలో డిఆర్‌డిఎ-సీడప్, వెలుగు ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు స్పందన కరువైంది. బుధవారం వెలుగు కార్యాలయంలో ఆదిత్య బిర్లా గార్మెంట్స్ ప్రతినిధి కిరణ్‌కుమార్, సీడాప్ పిఒ పృథ్వీరాజ్, వెలుగు ఎపిఎం మంజునాథ జాబ్‌మేళా నిర్వహించారు. మండల వ్యాప్తంగా కేవలం 15 మంది మహిళలు మాత్రమే హాజరయ్యారు. వెలుగు సిబ్బంది సరైన సమాచారం డ్వాక్రా సంఘాల మహిళలకు ఇవ్వకపోవడం, కేవలం కొద్దిమందికి మాత్రమే వెలుగు సిబ్బంది ట్రైనీ టైలర్స్ తెలిపారు. జాబ్‌మేళా పేలవంగా మారింది. అనంతరం జాబ్‌మేళాకు వచ్చిన మహిళలతో వెలుగు ఎపిఎం మాట్లాడుతూ మండలంలోని నిరుద్యోగ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆదిత్య బిర్లా కంపెనీ ట్రైనీ టైలర్ ఉద్యోగంలో చేరిన తర్వాత ఉద్యోగికి జీతంతోపాటు ఇతర అలవెన్సు ఉంటాయన్నారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిఎం మంజునాథ

రూ.లక్షలు ఖర్చు చేసి.. వృథాగా వదిలేసి

చెముళ్లపల్లో వృథాగా ఉన్న నీటి శుద్ధి పరికరాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రతి కుటుంబానికి సురక్షితమైన మంచినీటి జలాలను అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఆరో ప్లాంట్లు (శుద్ధినీటి కేంద్రాలు) చాలా చోట్ల వృథాగా ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో ప్రారంభించకుండానే మూలకు చేరాయి. గత తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో ఎంపీ నిధుల ద్వారా పెద్ద ఎత్తున శుద్ధినీటి కేంద్రాలను గ్రామాల్లో ఏర్పాటు చేశారు. ఒక్కో శుద్ధి నీటి కేంద్రానికి రూ.4లక్షలుపైబడి ఖర్చు చేశారు. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల శుద్ధి నీటి పరికరాలు నిరుపయోగంగా మారాయి. వివరాల్లోకెళితే.. మండల పరిధిలోని తవ్వారుపల్లి, చెముళ్లపల్లె, పత్తూరు, ముస్లిం కాలనీ తదితర ప్రాంతాల్లో శుద్ధి నీటి కేంద్రాలు నిర్మించారు. ప్రస్తుతం వేసవికాలం కావడంతో శుద్ధి నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బయట మార్కెట్లో మినరల్ వాటర్ కొనాలంటే క్యాన్ రూ.10నుంచి రూ.20 వరకు ఖర్చు చేయాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం రూ.కోట్ల ఖర్చు చేస్తున్నా కనీసం సురక్షితమైన మంచి నీటిని అందించేందుకు చర్యలు తీసుకోలేకపోతోందని ప్రజలు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఎంతో మంచి ఉద్దేశంతో శుద్ధి నీటి కేంద్రాలు ఏర్పాటు చేస్తే పర్యవేక్షణ లోపం కారణంగా మూలకు చేరాయి. మరికొన్ని గ్రామాలలో విద్యుత్ బిల్లుల భారం కారణంగా వాటర్ ప్లాంట్లను మూసివేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతుకు గురైన వాటిని వినియోగంలోకి తీసుకురావడంతోపాటు, ఆయా గ్రామాల్లో వృథాగా ఉన్న వాటిని వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అల్లూరి స్ఫూర్తితో కడప ఉక్కును సాధిద్దాం

అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్వాతంత్ర్య సమర యోధుడు రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యన్ని గడగడ లాడించిన మన్యం వీరుడు యువతకు స్ఫూర్తి ప్రధాత అల్లూరి సీతారామరాజు అని ప్రొద్దుటూరు డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు, కార్యదర్శి మేరీకుమార్, విశ్వనాథ్ తెలిపారు. డివైఎఫ్ఐ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అల్లూరి పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కడప ఉక్కు కోసం పోరాటాలు సాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో రమేష్, రవితేజ పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : అల్లూరి సీతారామరాజు వర్ధంతిని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, అరుణ్, యాసిన్ పాల్గొన్నారు

వేంపల్లె : భారత స్వాతంత్ర్య సంగ్రామంలో తెలుగు ప్రజలు గర్వించదగ్గ విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు అని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి కొనియాడారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం కాంగ్రెస్ నాయకులు వేంపల్లెలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు.

రవీంద్రుడు.. విశ్వ కవీంద్రుడు..

నోబెల్ పురస్కార గ్రహీత, గీతాంజలి రచయిత, రవీంద్రనాథ్ ఠాగూర్ విశ్వ కవీంద్రుడు, సాహితీ సార్వ భౌముడు, కళామ తల్లి ముద్దుబిడ్డ అని తులసిరెడ్డి శ్లాఘించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ 164వ జయంతిని వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, వెంకటేష్, నాగరాజు, రమణ, వినయ్ పాల్గొన్నారు.

ఖాజీపేట : భారత స్వాతంత్ర సమరయోధుడు, మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 101 వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక బస్టాండు కూడలిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ హాజీ గౌస్ ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ గున్నంపాటి వెంకటరమణ, చరిత్రకారులు షేక్ ఇంతియాజుద్దీన్ పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు అభినందనీయం

విద్యార్థి శ్రీబిందును అభినందిస్తున్న మంత్రి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో పులివెందుల ఎస్సీ బాలికల వసతిగృహం విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన హాస్టల్ వార్డెన్ నాగేశ్వరమ్మ అభినందనీయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాలా వీరాంజనేయ స్వామి, కమిషనర్ లావణ్య పేర్కొన్నారు. అమరావతిలోని తుమ్మలపల్లె కళా క్షేత్రంలో బుధవారం పదో తరగతిలో జిల్లాలోనే మంచి మార్కులు సాధించిన ఎస్సీ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం విద్యార్థి ఎ.శ్రీబిందులతను మంత్రి, కమిషనర్ ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రాన్ని, షీల్డ్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు అనేక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రతి విద్యార్థి కష్టపడి ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతమ్మ, ఎఎస్‌డబ్ల్యూ రామాంజనేయులు, హాస్టల్ వార్డెన్ నాగేశ్వరమ్మను మంత్రి, కమిషనర్ అభినందించారు.

పాఠశాల టాపర్‌కు కలెక్టర్ ప్రశంస

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యార్థి జస్వంత్‌రెడ్డిని అభినందిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

పదవ తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాల టాపర్‌గా నిలిచిన విద్యార్థి రుద్ర గంగాజస్వంత్ రెడ్డిని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్‌పి అశోక్‌కుమార్, డిఇఒ షంషీద్దీన్ అభినందించారు. బుధ వారం కడపలో జరిగిన విద్యా రత్న కార్యక్రమంలో మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో టాపర్‌గా నిలిచిన గంగ జస్వంత్‌రెడ్డిని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ ప్రశంసాపత్రాన్ని అందజేశారు. రామిరెడ్డిపల్లి ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించిన గంగ జస్వంత్‌రెడ్డి పదో తరగతి పరీక్షల్లో 592 మార్కులు సాధించినట్లు ఎంఇఒలు టి.బేబి, స్టాలిన్ ఐజాక్ పేర్కొన్నారు. అత్యధిక మార్కులు సాధించడం వలన టాప్ టెన్ విద్యా రత్నాల్లో గంగ జస్వంత్ రెడ్డి 5వ స్థానం సంపాదించినట్లు వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నా, పెద్దల పట్ల విధేయతలు చూపాలన్నా ముందుగా తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల పాత్ర ఎక్కువగా ఉంటుందన్నారు. జస్వంత్‌రెడ్డి మండలానికి మంచిపేరు తెచ్చారన్నారు. రామిరెడ్డిపల్లి పాఠశాల హెచ్‌ఎం నాగాంజనేయులును, ఉపాధ్యాయులను, ఎంఇఒలు అభినందించారు.

ఖాళీ బిందెలతో పంచాయతీ కార్యాలయం ముట్టడి

ఖాళీ బిందెలతో నిరసన చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి - వేంపల్లె

తమకు తాగునీరు అందివ్వాలని స్థానిక రాజీవ్‌నగర్ కాలనీ మహిళలు బుధవారం ఖాళీ బిందెలతో పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. పంచాయతీ కార్యదర్శి బయటికి రావాలంటూ రాజీవ్‌నగర్ మహిళలు నినాదాలు చేశారు. 4 నెలలుగా తాగునీరు సరఫరా కావడం లేదని మహిళలు వాపోయారు. నీటి సరఫరాలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీరు కోసం పనులు కూడా విడిచిపెట్టి ఇంటి వద్దే ఉండాల్సిన పరిస్థితి వచ్చిందని వాపోయారు. రాజీవ్ నగర్‌లో కొన్ని ప్రాంతాలకు మాత్రమే నీరు సరఫరా అవుతోందన్నారు. పంచాయతీ కార్యాలయంలో ఉన్న పులివెందుల డిఎల్‌పిఒ రమాదేవి, పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి బయటికి వచ్చి తాగునీటి సమస్యను తొందరలో పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. నీటి సరఫరా చేసే సిబ్బంది సమస్యపై ప్రజలను అడిగి అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

సర్పంచ్ చొరవతో పైప్‌లైన్‌కు మరమ్మతులు

స్థానిక చింతలమడుగుపల్లె క్రాస్‌రోడ్డు వద్ద పైప్‌లైన్ పగిలి మంచినీరు, మురికి నీరు కలుషితం కావడంతో ఆ ప్రాంత ప్రజలు సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన సర్పంచ్ వెంటనే పులివెందుల నుంచి కంప్రెసర్ తెప్పించి మరమ్మతులు చేయించారు. అందుకు ఆ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లిన వార్డు సభ్యుడు సునీల్ ను ప్రజలు అభినందించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సర్పంచ్ శ్రీనివాసులు ప్రజలకు సూచించారు.

ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ఎన్.వరదరాజులరెడ్డి

డిఎడబ్ల్యు డిగ్రీ కళాశాల నూతన భవనం ప్రారంభం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కొర్రపాడు రోడ్డులోని డిఎడబ్ల్యు జూనియర్, డిగ్రీ మహిళా కళాశాల డివిసి శంబునాథ్ అతని సహోదరులు ఆధ్వర్యంలో బుధవారం నూతన భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు కళాశాల యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ బద్వేలు శ్రీనివాసుల రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యులు తోట మహేశ్వర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మారుతి ప్రసాద్ రెడ్డి, నాయకులు నంద్యాల హనుమంత్ రెడ్డి, కుమార్‌రెడ్డి, ధనియాల రాఘవరెడ్డి, బచ్చల ప్రతాప్, పొలిమేర నవీన్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నజురుల్లా దర్గా ఆస్తిని విక్రయించే హక్కు ఎవరికీ లేదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరులోని నజురుల్లా దర్గా ఆస్తిని విక్రయించే హక్కు ఎవరికీ లేదని, ఆ విధంగా నజురుల్లా సాహెబ్ 1944లో పగడ్బందీగా వీలునామా రాశారని వీరుల దర్గా కమిటీ కార్యదర్శి దాదాపీర్ పేర్కొన్నారు. నదురుల్ల కల్యాణమండగంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నజురుల్లా కుమారులలో శిష్యులలో ఒకరి తదనంతరం మరొకరికి చెందేలా రాశారన్నారు. పరాధీనం చేసే వీలు లేదన్నారు. ఈ ప్రదేశంలో నిరంతరం ప్రార్థన జరుపుకునేందుకు ఒక మసీదు నిర్మాణమైందని, అభివృద్ధి చేసేందుకు పేదలకు జీవనోపాధికి అంగుళాలు, కల్యాణ మండపాన్ని నిర్మించామన్నారు. దాతల సహకారంతో తేనమండపాన్ని నిర్మించామన్నారు. కోశాధికారి నూరుల్లా మాట్లాడుతూ దర్గాకు చెందిన 3.23 ఎకరాల్లో ప్రజాప్రయోజనార్థం ప్రభుత్వం స్వాధీనం చేసుకోగా, నికరంగా 1.56 ఎకరాలు మిగిలిందని, ఇందులో 21 సెంట్లలో షాదిఖానా కట్టామన్నారు. ఈ స్థలం ముస్లింల ఆస్తిగా తెలిపేందుకు మసీదును నిర్మించామన్నారు. ఈ స్థలం క్రయవిక్రయానికి అవకాశం లేదన్నారు. అభివృద్ధి చేసేందుకు మాత్రమే అవకాశం ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో అంజుమన్ మాజీ అధ్యక్షులు ఇక్బాల్, శామీర్, మహమ్ముద్ పాల్గొన్నారు.

రెవెన్యూ కార్యాలయానికి ఫ్రిజ్ వితరణ

ముద్దనూరు : రెవెన్యూ కార్యాలయానికి బువారం మండల నాయకులు డాక్టర్ కటికరెడ్డి మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో కూల్‌వాటర్ ఫ్రిజ్ వితరణ చేశారు. కార్యాలయం ఆవరణలో ప్రజల దాహార్తి కోసం తహశీల్దార్ వరదకిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో చలివేంద్ర ఏర్పాటు చేశారు. ఆర్‌ఐ పెంచలలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్రిజ్ వితరణ చేసిన మధుసూదనరెడ్డి



ఆర్‌డిఒను సన్మానిస్తున్న మహబూబ్ బాషా

ఆర్‌డిఒ చిన్నయ్యకు సన్మానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల ఆర్‌డిఒగా బుధవారం బాధ్యతలు చేపట్టిన చిన్నయ్యను మైనార్టీ నాయకులు హజ్ కమిటీ సభ్యుడు మహబూబ్‌బాషా సన్మానించి, అభినందనలు తెలిపారు. పులివెందుల ఇన్‌ఛార్జి ఆర్‌డిఒగా విధులు నిర్వహిస్తున్న చిన్నయ్యను రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ ఖాసింవలి, టిడిపి నాయకులు గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

11 నుంచి అగ్రహారం ఊరుసు

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక అగ్రహారంలోని శ్రీశ్రీశ్రీ హజరత్ ఖాజా సయ్యద్ నత్తహర్ షావలి రహమతుల్లా అలైహి ఊరుసు ఆదివారం నుంచి నాలుగు రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 11న ఆదివారం ఖాజీపేట నుంచి నషాన్ కార్యక్రమం కాగా, 12న సోమవారం గంధం (సిద్దారం ఖదీరుల్లా ఇంటి నుంచి బయలు దేరును), 13న మంగళవారం ఖాజీపేట నుంచి జెండా మహోత్సవం (మసీద్ దగ్గర నుంచి మంగళ వాయిద్యాలతో బయలుదేరును) 14న బుధవారం జియారత్ తహలీల్ ఫాతెహా కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 12న గంధం, ఉరుసు రోజున గొప్ప ఖవ్వాలి పోటీలు జరగనున్నాయని తెలిపారు. 13న బండలాగుడు పోటీలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

వాసవి అమ్మవారికి ప్రత్యేకపూజలు

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక మెయిన్ బజార్‌లోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వాసవి మాత జయంతి సందర్భంగా బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు అధిక సంఖ్యలో కుంకుమార్చనలో పాల్గొన్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

సిబ్బంది నియామకం హర్షణీయం

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలోని దేవాలయాల్లో వైదిక సిబ్బంది నియామకానికి ప్రభుత్వం ఆమోదం తెలపడం హర్షణీయమని బ్రాహ్మణ చైతన్య వేదిక నాయకులు రఘునాథ్ రావు, ప్రసాదరావు బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. దేవాదాయశాఖలో ఉద్యోగాల భర్తీకి ఆమోదం ఇవ్వడం సంతోషకరమన్నారు. అయిదేళ్లుగా నియామకాలు లేక దేవాదాయ శాఖలో పర్యవేక్షణ కొరవడిందన్నారు. అవినీతి పెరిగిందని తెలిపారు. వైదిక సిబ్బంది కొరతతో రెగ్యులర్ పూజలు చాలా చోట్ల అరకొరగా జరుగుతున్నట్లు చెప్పారు. సిబ్బంది నియమిస్తే సమస్యలు తీరడంతోపాటు భక్తులకు ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. 16 ప్రముఖ ఆలయాల్లో నిత్యాన్నదాన పథకం అమలు చేయాలని ఆదేశించడం సంతోషకరమన్నారు. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు ప్రారంభించడం శుభ సూచకమన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతితోపాటు దేవాలయాలు అభివృద్ధి చెందాలని, రాష్ట్రం టూరిజం కేంద్రంగా మారితే రాష్ట్ర ఆదాయం పెరుగుతుందని తెలిపారు.

ట్రిపుల్‌ఐటి అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - వేంపల్లె

వినోద్‌కుమార్

ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కేతినేని వినోద్‌కుమార్‌కు డాక్టరేట్ లభించింది. చెన్నై వెల్స్ యూనివర్సిటీలోని సిఎస్ఇ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ప్రొఫెసర్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో లోడ్ బాలెన్సింగ్ ఇన్ కుడ్ కంప్యూటింగ్‌పై ఆయన పరిశోధన చేశారు. ఈనెల 5న పిహెచ్‌డి పట్టా పొందారు. ఆర్కేవ్యాలీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలనాధికారి రవి కుమార్, అధ్యాపక బృందం అభినందించారు.

కమిషనర్‌కు వినతిపత్రమిస్తున్న సిఐటియు నాయకులు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సిఐటియు కార్యదర్శి దాసరి విజయ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ యూనియన్ నాయకులు ఎస్.శేఖర్. బి.నాగన్న కమిషనర్‌కు సమ్మెపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 20న జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం అంతా పాల్గొని, వారి హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మైకేల్, బాలు, పుల్లయ్య, ప్రభావతమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

మండల గ్రామ రెవెన్యూ అధ్యక్షుడిగా రామాంజనేయులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మండల గ్రామ రెవెన్యూ అధ్యక్షుడిగా రామాంజనేయులు ఎన్నికయ్యారు. బుధవారం కడప అధ్యక్షులు సమక్షంలో పులివెందుల మండలం గ్రామ రెవెన్యూ అధికారుల సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సి.రామాంజనేయులు, ఉపాధ్యక్షుడిగా బి.మార్క్, సెక్రెటరీగా బాబు, ట్రెజరర్‌గా ఏకాశి ఆంజనేయులు, జాయింట్ సెక్రెటరీలుగా పిచ్చిపాటి శ్రీనివాస్‌రెడ్డి, భార్గవి, ఇసి మెంబర్లుగా షేక్ మొహమ్మద్ రఫీ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

శ్రీ కమలాపురం జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S.No. 229/2023

వడ్డెమాని చెన్నమ్మ, W/o వి.చిన్నఈశ్వరరెడ్డి(లేట్), హిందూ, వయస్సు 70 సం॥లు, హౌస్ వైఫ్, వ్యవసాయం, సాకిన్ టి.సుంకేసుల గ్రామం, ఎర్రగుంట్ల మండలం, వై.యస్.ఆర్. కడప జిల్లా. ...వాది

Vs

జిల్లెల్ల శ్రీనివాస రెడ్డి, S/o జె.సుబ్బిరెడ్డి, హిందూ, వ్యాపారం, వ్యవసాయం, వయస్సు సుమారు 48 సం॥, సాకిన్, ఎర్రగుంట్ల టౌన్, డోర్‌నెం.5/82, ఎర్రగుంట్ల మండలం, వై.యస్.ఆర్. కడప జిల్లా. ...ప్రతివాది

దావా సమను

యీ నెంబరు దావాను వాది నీ పైన ప్రామిసరీ నోటును గురించి రూ.12,14,599-00లను రాకోరి దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో నీవు 15.5.2025 తేదీన పగలు 10.30 ని॥లకు పై కోర్టులో హాజరు కావలెయును. లేనంతట ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

వాయిదా తేది:15.5.2025

//కోర్టు వారి ఉత్తర్వు మేరకు//

వై.యస్.నాగభూషణ రెడ్డి
అడ్వకేట్,
కమలాపురం.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల వేంపల్లి రోడ్డు జువారి సిమెంట్ రోడ్డు క్రాస్ వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. కీర్తిపల్లె గ్రామం నుంచి ప్రొద్దుటూరుకు వివిధ పనుల నిమిత్తం ఆటోలో ఐదుగురు బయలుదేరారు. ఈ క్రమంలో వేగంగా అటువైపు నుంచి వస్తున్న లారీ మలుపు తిప్పబోయి ఆటోను ఢీకొంది. ఆటోలో ఉన్న నలుగురికి తీవ్రంగా గాయపడ్డారు. అటు వెళుతున్నవారు గమనించి 108లో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వారు